నన్నయ ఓఎస్‌డీ ఆచార్య టేకి ఆకస్మిక మృతి


ఆచార్య టేకి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ మేనేజ్ ప్రొఫెసర్, ఓఎస్‌డీ ఆచార్య ఎస్.టేకి (53) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. రాజమహేంద్రవరంలోని సీటీఆర్ఐ వద్ద భాస్కరనగర్‌లో నివాసం ఉంటున్న ఆయన ఎప్పటిలాగే ఉదయాన్నే షటిల్ ఆడి వచ్చారు. తర్వాత యూనివర్సిటీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్న సమయంలో గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారు. ఆస్పత్రికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకపోయింది. టేకి హఠాన్మరణం యూనివర్సిటీ వర్గాలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. యూనివర్సిటీలో అధ్యాపకునిగా, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, రిజిస్ట్రార్‌గా, ఓఎస్‌డీగా వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించారు. 1993లో భారతీయ విద్యాభవన్ (జల్గావ్)లో, 1995 ఉత్తర మహారాష్ట్ర యూనివర్సిటీ (జల్గావ్)లో లెక్చరర్‌గా బోధన వృత్తిని చేపట్టారు. 1998లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫారెస్టు మేనేజ్మెంట్ భోపాల్‌లో రీసెర్చ్ అసోసియేట్, 2007లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్సియల్ మేనేజ్మెంట్ (ఫరీదాబాద్)లో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. 2009 నుంచి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో పని చేస్తున్నారు. టేకి మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామమైన మండపేటకు తరలించారు. అక్కడ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. భార్య, కుమార్తె దగ్గరలోనే ఉన్నాగాని, బీటెక్ చదువుతున్న కుమారుడు ఇంటర్న్‌షిప్ కారణంగా మహారాష్ట్రలో ఉండటంతో చూస్తున్నారు.

రత్నగిరి.. భక్త ఝురి

- వరుస సెలవులతో వేలాదిగా తరలివచ్చిన జనం, నవ దంపతులు
- గురువారం సత్యదేవుని దర్శించిన 40 వేల మంది
- రెండు వేల వ్రతాల నిర్వహణ, రూ.40 లక్షల ఆదాయం


సత్యదేవుని వ్రతాలాచరిస్తున్న భక్తులు, నవ దంపతులు

అన్నవరం: వరుస సెలవులు, వివాహాల సందడి కారణంగా వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి సత్యదేవుని ఆలయం గురువారం కిటకిటలాడింది. దీనికితోడు సుమారు రెండు నెలల విరామం అనంతరం మళ్లీ వివాహాల సందడి మొదలవడంతో నవదంపతులు, పెళ్లి బృందాలతో స్వామివారి ఆలయం, ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పెద్ద సంఖ్యలో భక్తులు రత్నగిరికి తరలివచ్చారు. దీంతో స్వామివారి ఆలయ ప్రాంగణం, క్యూ లు, వ్రత మంటపాలు, అన్నీ భక్తులతో నిండిపోయాయి. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరిపై సుమారు వంద వివాహాలు జరిగాయి. ఇతర ప్రాంతాలలో కూడా అదే ముహూర్తానికి పెద్ద సంఖ్యలో వివాహాలు జరగడంతో తమ బంధువులతో కలసి నవ దంపతులు సత్యదేవుని ఆలయానికి తరలి వచ్చారు.

సత్యదేవుని దర్శించిన 40 వేల మంది భక్తులు

సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారని అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. స్వామివారి దర్శనానికి రెండు గంటలు, రూ.200 టిక్కెట్‌తో అంతరాలయ దర్శనానికి గంట సమయం పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజన సౌకర్యం కల్పించినట్లు అధికారులు తెలిపారు.


సత్యదేవుని వ్రతాలాచరించడానికి మంటపం వద్ద వేచి ఉన్న భక్తులు


రత్నగిరిపై గురువారం తెల్లవారుజామున పెళ్లి సందడి

మూడు రోజులు కొనసాగనున్న రద్దీ

శుక్ర, శని, ఆదివారాల మూడు రోజులు పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉండడంతో రత్నగిరిపై రద్దీ కొనసాగనుంది. మూడు రోజులు సుమారు 500 వివాహాలు జరిగే అవకాశం ఉందని పండితులు తెలిపారు. భక్తుల రద్దీ తట్టుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని మాలపల్లి తూము వద్ద అగ్ని ప్రమాదంలో హోటల్ దగ్ధం అయిందని అనపర్తి అగ్నిమాపక దళం అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన అని వ్యక్తి దేవరపల్లి సత్యానారాయణ హోటల్ నడుపుతూ అక్కడే నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీంతో హోటల్ సామగ్రి అంతా కాలిపోయిందన్నారు. సుమారు రూ.లక్షన్నర వరకు ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. సర్పంచ్ బుంగా రామారావు, ఉపసర్పంచ్ నల్లమిల్లి వెంకటరెడ్డి బాధితులకు అండగా ఉంటామని తెలిపారు.


బలభద్రపురంలో అగ్నిప్రమాదంలో మంటలు అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

క్వారీలో జారిపడిన ట్రాక్టర్ : డ్రైవర్ మృతి

కొవ్వూరు: దేచెర్ల రెవెన్యూ పరిధిలో ఉన్న ఆర్లమ్మ క్వారీలో ట్రాక్టర్ బోల్తా పడిన దుర్ఘటనలో దేవరపల్లి మండలం గౌరీపట్నం గ్రామానికి చెందిన కొండల తాతరావు (47) గురువారం మృతి చెందారు. క్వారీలో రాళ్ల డ్రిల్లింగ్ చేసేందుకు కొండపై తాతారావు ట్రాక్టర్‌ని సక్రమంగా పెడుతున్న తరుణంలో అకస్మాత్తుగా జారి క్వారీలో పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న తాతారావు ఘటనా స్థలంలోనే మృతి చెందారని రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. మృతుడు తాతరావు ఓనర్ కం డ్రైవర్‌గా ట్రాక్టర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. క్వారీ ఆకుల ప్రకాష్‌కి చెందినదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

అవమానం భరించలేక ఆత్మహత్య

సామర్లకోట: ఒక మహిళ చేతిలో జరిగిన అవమానాన్ని భరించలేక టిఫిన్ సెంటర్ యజమాని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇది. మేడిశెట్టి గోపాలకృష్ణ (45) తన సెల్‌ఫోన్ సెల్ఫీ వీడియోలో చనిపోవడానికి కారణాలను చెప్తూ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి పరిస్థితిని గమనించి అతని కుమార్తె బాలా త్రిపుర కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించింది. చికిత్స పొందుతూ గురువారం ఉదయం ఆస్పత్రిలో మృతి చెందాడు. దాంతో గోపాలకృష్ణ సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆ వీడియో ప్రకారం సామర్లకోట మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో పోలింగ్ రింగ్ సెంటర్ వద్ద టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్న సమయంలో సుమారు ఏడేళ్ల క్రితం హోటల్‌లో పని చేయడానికి వచ్చిన ఏసమ్మ అనే స్థానిక మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. అప్పటి నుంచి ఆమెను పోషిస్తున్నాడు. ఇటీవల ఏసమ్మ తన పుట్టింటికి వెళ్లి పోవడంతో కారణం తెలుసుకోవడానికి వెళ్లిన సమయంలో ఏసమ్మ అక్క బుజ్జమ్మ, నానమ్మ శేషారత్నం బహిరంగంగా చెప్పుతో కొట్టారు. ఆ సంఘటనను భరించలేక చనిపోతున్నానని వీడియోలో చెప్పాడు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి యువకుడి హత్య

- మేడపై నిద్రిస్తుండగా కత్తిపీట, కర్రతో దాడి చేసిన యువతి, యువకుడు
- ప్రేమ వ్యవహారమే కారణమని భావిస్తున్న పోలీసులు
- గోకవరం మండలం తిరుమలాయపాలెంలో ఘటన


మృతుడు ఒమ్మి నాగశేషు (ఫైల్)

గోకవరం: ఇద్దరు యువతీ యువకుల మధ్య నడిచిన ప్రేమ వ్యవహారం చివరకు యువకుడి హత్యకు దారితీసింది. అర్ధరాత్రి సమయంలో మరో యువకుడితో కలిసిన యువతి మేడపై నిద్రిస్తున్న యువకుడిపై కత్తిపీట, కర్రతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచి హతమార్చింది. గోకవరంలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఒమ్మి నాగేశేషు (25) తాపీ పని చేసుకుని జీవిస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం గొల్లప్రోలు మండలం చేబ్రోలుకు చెందిన అరుణతో వివాహమైంది. బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలానికి చెందిన కుర్ల డిబేరా అనే యువతి, రాజవొమ్మంగి మండలానికి చెందిన శివన్నారాయణ అనే యువకుడితో కలిసి నాగశేషు ఇంటికి వచ్చి మేడపై నిద్రిస్తున్న అతనిపై వెంట తెచ్చుకున్న కర్ర, కత్తిపీటతో తీవ్రంగా దాడి చేసి గాయపరిచారు. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న నాగశేషు కేకలు విన్న తల్లి గంగ, స్థానికులు 108కు సమాచారం అందించారు. తీవ్రంగా గాయపడిని అతన్ని తొలుత గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో రంపచోడవరం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. హతుడు నాగేషుకి, డిబేరాకి సుమారు ఏడేళ్ల నుంచి ప్రేమ వ్యవహారం నడుస్తోందని, ఈ క్రమంలో అతనికి డిబేరా రూ.2 లక్షలు నగదు, బంగారు గొలుసు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఆ నగదు తిరిగి ఇవ్వాలని డిబేరా కొంత కాలంగా నాగేషుని డిమాండ్ చేస్తోంది. డబ్బు, బంగారం తిరిగి ఇవ్వకపోవడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్టు పోలీసులు భావిస్తున్నారు. విషయం తెలుసుకున్న కోరుకొండ సీఐ వై.ఉమామహేశ్వరరావు, గోకవరం ఎస్సై యూవీ శివనాగబాబు ఘటన జరిగిన ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు ఆ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ముద్దాయిలను అదుపులోకి తీసుకుని వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఘటన గ్రామంలో తీవ్ర అలజడి రేకెత్తించింది. అర్ధరాత్రి సమయంలో ఇటువంటి ఘటన జరగడంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.


తిరుమలాయపాలెంలో మేడపై హత్య జరిగిన ప్రదేశం


స్థానికుల నుంచి వివరాలు సేకరిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ కడలి వెంకటేశ్వరరావు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి


మెప్మా బజార్‌ను తిలకిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. గురువారం నగరంలోని పుష్కర్ ఘాట్ వద్ద మెప్మా బజార్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కొనుగోలుదారులను ఆకట్టుకునేలా వస్తువుల తయారీ ఉండాలన్నారు. ప్రజలకు ఏది అవసరమో తెలుసుకొని తయారు చేసి మార్కెట్ లో ప్రదర్శిస్తే తప్పక ఫలితం ఉంటుందని మహిళలకు సూచించారు. మెప్మా బజార్ జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అటుపై జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా మీ వస్తువుల తయారీలో నైపుణ్యత చూపాలని అన్నారు. మీ వ్యాపార రంగ అభివృద్ధికి ప్రభుత్వపరంగా కావాల్సిన సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎంపీ భరత్ చెప్పారు. అన్ని స్టాల్స్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, నగర యువజన అధ్యక్షురాలు పీత రామకృష్ణ, మింది నాగేంద్ర, యిన్నమూరి ప్రదీప్, కాలే చిన్ని, అరిగెల బాబు తదితరులు పాల్గొన్నారు.


డీసీసీబీ రాజమహేంద్రవరం బ్రాంచికి కొత్త భవనం

- రూ.2.50 కోట్లతో నూతన భవనానికి శంకుస్థాపన


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి. చిత్రంలో మంత్రి తానేటి వనిత, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆప్కాబ్ చైర్మన్ మల్లెల ఝాన్సీ, డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు(ఫైల్)

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పూర్వపు మద్రాసు ప్రభుత్వం 1939లో రాజమహేంద్రవరంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు బ్రాంచి భవనం నిర్మించింది. ఈ భవనం నిర్మించి 83 ఏళ్లు పూర్తికావడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. డీసీసీబీ బ్రాంచిలో 16వేల మంది ఖాతాదారులు, రుణాలు, అడ్వాన్సుల కింద రూ.95కోట్లు, డిపాజిట్లు రూ.119కోట్లు, రూ.214కోట్లతో టర్నోవర్‌తో బ్యాంకు నడుస్తోంది. ఖాతాదారులు సౌకర్యార్థం తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు డీసీసీబీ రాజమహేంద్రవరం బ్రాంచికి నూతన భవనం నిర్మించాలని ఆకాంక్షించారు. రూ.2.50 కోట్లతో నిర్మించే భవనానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన రెడ్డి చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేశారు. 2800 చదరపు అడుగులలో నాలుగు అంతస్థుల్లో సుందరమైన భవనం నిర్మించనున్నారు. భవనాన్ని త్వరగా పూర్తి చేస్తామని జిల్లా సహకార కేంద్రబ్యాంకు చైర్మన్ ఆకుల వీర్రాజు తెలిపారు.

హోం మంత్రిని కలిసిన ఈస్ట్‌జోన్ డీఎస్పీ


మంత్రి వనితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌బాబు

కొవ్వూరు: రాజమహేంద్రవరం ఈస్ట్‌జోన్ డీఎస్పీగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కిషోర్‌బాబు గురువారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితను మర్యాదపూర్వకంగా కలిశారు. కొవ్వూరు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన డీఎస్పీల బదిలీల్లో భాగంగా మార్కాపురం సబ్ డివిజన్ నుంచి తాను బదిలీపై రాజమహేంద్రవరం వచ్చినట్టు ఆయన తెలిపారు. బొమ్మూరు సీఐ విజయ్‌కుమార్ ఆయన వెంట ఉన్నారు.

రేపు జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత గురువారం తెలిపారు. ఫిజికల్, హైబ్రిడ్ విధానంలో లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల ప్రాంతాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు.

దేవాలయాలకు ట్రస్టు బోర్డుల నియామకం


పుట్టా శ్రీకౌమారి రామశర్మ, చందాసత్రం చైర్మన్


ఇన్నమూరి ప్రదీప్,మార్కండేయేశ్వరస్వామి వారి దేవస్థానం


దుంగా మంగాలక్ష్మి, సత్యనారాయణస్వామి వారి దేవస్థానం


బర్రే కొండబాబు, గౌతమి జీవకారుణ్య సంఘం చైర్మన్


చవ్వాకుల సుబ్రహ్మణ్యం, సారంగధరేశ్వర స్వామి వారి దేవస్థానం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం నగరంలో దేవదాయ శాఖ నిర్వహణలో ఉన్న పలు దేవాలయాలకు పాలకమండలి కమిటీలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్టు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. ఆయా ఆలయాల ట్రస్టు బోర్డు చైర్మన్లు, కమిటీ సభ్యుల పేర్లను మీడియాకు వెల్లడించారు. శ్రీ మార్కండేశ్వర స్వామి దేవస్థానానికి ట్రస్టు బోర్డు చైర్మన్‌గా ఇన్నమూరి ప్రదీప్, శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి చైర్మన్‌గా దుంగా మంగాలక్ష్మి, గౌతమి జీవకారుణ్య సంఘ చైర్మన్‌గా బర్రే కొండబాబు, చందా సత్రానికి పుట్టా శ్రీ కౌమారి రామశర్మ, సరంగదరేశ్వర స్వామి వారి దేవస్థానానికి చవ్వాకుల సుబ్రహ్మణ్యం చైర్మన్లుగా నియమితులయ్యారని ఎంపీ భరత్ తెలిపారు. ఇంకా పందిరి మహాదేవుడు సత్రానికి పాలకమండలిని వేయాలని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. జాంపేట, వేణుగోపాలస్వామి, కన్నమాంబ, విశ్వేశ్వర స్వామి తదితర ఆలయాలకు కమిటీలను వేయాల్సి ఉందని, రూరల్ కోఆర్డినేటర్‌తో చర్చించి వాటిని కూడా పూర్తి చేస్తామని ఎంపీ భరత్ తెలిపారు.

అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదు

వైఎస్సార్ సీపీ నేత బూరాడకు ఘన నివాళులర్పించిన ఎంపీ భరత్


భవానీశంకర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్, అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ నేత, మాజీ కార్పొరేటర్, స్థానిక 44వ వార్డు ఇన్‌చార్జి దివంగత బూరాడ భవానీ శంకర్‌కు వైఎస్సార్ సీపీ రాజమండ్రి నగర శాఖ తన ప్రగాఢ సంతాపాన్ని తెలిపింది. గురువారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయంలో ఆ పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి అధ్యక్షతన బూరాడ భవానీ శంకర్ సంతాప సభ నిర్వహించారు. బూరాడ భవానీశంకర్ చిత్రపటానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి తదితర పార్టీ ప్రముఖులు పుష్పాంజలి ఘటించి, ఆయన పవిత్రాత్మకు శాంతి కలగాలంటూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎంపీ భరత్ మాట్లాడుతూ, అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. భవానీ శంకర్ కుటుంబ సభ్యులకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వ పరంగా అన్ని విధాలా సహకారం అందివ్వడమే కాకుండా భద్రత కల్పిస్తామని చెప్పారు. మాజీ కార్పొరేటర్ బూరాడను హత్య చేయాలంటే ఎంత ధైర్యం ఉండాలి, ఈ విష సంస్కృతిని ఎవరు పెంచి పోషిస్తున్నారనేది తెలియాలన్నారు. ఈ ప్రశాంత రాజమహేంద్రవరం నగరంలో ఈ హత్యలు, దోపిడీలను ఆదిలోనే తుంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లి నిర్మల, స్టాలిన్, మజ్జి అప్పారావు, మింది నాగేంద్ర, మార్తిలక్ష్మి, పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, టీకే విశ్వేశ్వరరెడ్డి, కానుబోయిన సాగర్ తదితరులు పాల్గొని బూరాడకు ఘన నివాళులర్పించారు.

బుచ్చయ్యా.. అభివృద్ధిపైనా విమర్శలేనా?

- నిస్వార్థంగా సేవలందిస్తుంటే ఆరోపణలా?
- రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శలు చేశారని, ఆయన 40 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని తాను నాలుగేళ్లలో చేసి చూపించానని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత వ్యాపారాలు మానుకుని, నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నానని అన్నారు. నగర పాలక సంస్థను అస్తవ్యస్తం చేసినట్టు ఆరోపించారని, ఆధారాలతో నిరూపించగలరా అని ఎమ్మెల్యే గోరంట్లకు ఎంపీ భరత్ సవాల్ విసిరారు. కంబాల చెరువు వద్ద దండి మార్చ్, నాగుల చెరువులో క్రికెట్ స్టేడియం నిర్మాణాలు సైంటిఫిక్ ఇంజినీర్ల సూచనలతో ఏర్పాటు చేశామని చెప్పారు. 'ఆవ రోడ్డు విస్తరణ మీరు చేయలేకపోయారు. నేను చేసి చూపిస్తున్నాను. మోరంపూడి జంక్షన్ పై ఓవర్ బ్రిడ్జి మీ 40 ఏళ్ల సర్వీసులో సాధించలేకపోయారు. నేను అది సాధించాను' అని ఎంపీ భరత్ అన్నారు. ఏదైనా విమర్శ చేస్తే అర్థవంతంగా ఉండాలని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడడం తగదని చెప్పారు. అభివృద్ధిని చూసి అభినందించకపోయినా పర్వాలేదని, కానీ అర్థం పర్థం లేని విమర్శలు చేయడం వల్ల మీకే నష్టం అని ఎమ్మెల్యే గోరంట్లను ఉద్దేశించి ఎంపీ భరత్ అన్నారు. విలేకర్ల సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్, రాష్ట్ర ఖాదీ బోర్డు వైస్‌చైర్మన్ పిల్లి నిర్మల, రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి, బర్రే కొండబాబు, టీకే విశ్వేశ్వర రెడ్డి, బిల్డర్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్‌లో ఇంటర్ ఫస్టియర్ ప్రవేశాలు

కంబాలచెరువు: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవకుమారి గురువారం తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, తెలుగు, ఇంగ్లీషు మీడియం, హెచ్‌ఈసీ తెలుగు మీడియం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ కోర్సుల్లో చేరాలనుకున్న వారు కళాశాలలోని అడ్మిషన్ విభాగంలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 93986 77385, 9866131354 నంబర్లకు సంప్రదించాలన్నారు.

అభివృద్ధి జరగలేదంటే ప్రజలే బుద్ధి చెబుతారు

టీడీపీ నేత వంగలపూడి అనితపై రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆగ్రహం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రుడా చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధీ జరగలేదని, ప్రజా సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ప్రజల ముందుకు వెళ్లి చెబితే వారే బుద్ధి వచ్చేలా టీడీపీ నేతలకు సమాధానం చెబుతారని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కంబాల చెరువు సెంటర్‌లోని ఈట్ అండ్ ప్లేలో ఆమె గురువారం విలేకర్లతో మాట్లాడారు. రాజమహేంద్రవరం తిలక్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఇటీవల తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు వంగలపూడి అనిత మాట్లాడుతూ, జగన్ ప్రభుత్వంలో అభివృద్ధి జరగడం లేదని, అదేవిధంగా ఆదిరెడ్డి అప్పారావు, వాసులది అక్రమ అరెస్టులని చేసిన వ్యాఖ్యలను షర్మిలారెడ్డి ఖండించారు. ఏ తప్పూ, అక్రమాలు చేయకపోతే ఆదిరెడ్డి తండ్రీ కొడుకులను సీఐడీ ఎందుకు అరెస్టు చేస్తుందని, జగజ్జనని చిట్ ఫండ్ కంపెనీలో అక్రమాలు జరిగాయి కాబట్టే చర్యలు తీసుకున్నారని అన్నారు. తప్పు చేస్తే తమ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన, మన అనే భేదం లేకుండా ఒకేలా చర్యలు తీసుకుంటారనే విషయాన్ని గతంలో జరిగిన చాలా సంఘటనలు తెలియజేస్తున్నాయన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగడం లేదని ప్రజల ముందుకెళ్లి మాట్లాడితే తరిమి కొడతారని అన్నారు. ఇక వంగలపూడి అనిత విషయానికి వస్తే వైఎస్సార్ సీపీ ఫ్యాన్ గాలికి ఎగిరిపోయిన ఆమె మాటలు కూడా గాలి మాటలేనని, విషయ పరిజ్ఞానం లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబు, లోకేష్ రాష్ట్రంలో ఎక్కడ ఏం జరిగినా దానికి తమ పార్టీకి, జగన్‌మోహన్‌రెడ్డికి ఆపాదించడం సరి కాదని షర్మిలారెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ తమ వైఎస్సార్ సీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వస్తుందని చెప్పారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గాండ్ల, తెలుకుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సంకిస భవానీప్రియ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఫ్లోర్‌లీడర్ పోలు విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు ఈతకోట బాపన సుధారాణి, మజ్జి నూకరత్నం, అనుసూరి పద్మలత, బల్లా సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకురాలు నిరీక్షణ జేమ్స్, కొత్త విజయ రాజ్యలక్ష్మి, సాలా సావిత్రి, కాటం ప్రియాంక, గుడాల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న హెచ్ఎం దుర్గాప్రసాద్

కంబాలచెరువు: విద్యార్థులు వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేలా చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని కంటిపూడి రామారావు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.దుర్గా ప్రసాద్ అన్నారు. మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులకు జిల్లా పరీక్షల నిర్వహణా సంస్థ(డీసీఈబీ) అందజేసిన 'సెలవుల్లో సరదాగా.. సమ్మర్ క్యాంప్' స్టడీ మెటీరియల్‌ను గురువారం విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం లక్ష్యాన్ని తల్లిదండ్రులకు వివరించి, బుక్స్ అందచేశామన్నారు. ఉపాధ్యాయులందరూ ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూపుల ద్వారా విద్యార్థులకు చేయాల్సిన కృత్యాలు పంపిస్తామన్నారు. విద్యార్థులు ఈ బుక్స్‌తో పాటు సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లి దిన పత్రికలు కూడా చదవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల సుబ్బారావుకు అభినందనలు

ప్రకాశం నగర్ : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావును ఉమెన్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ సిటీ గ్రూప్ సభ్యులు అనూప్ జైన్ సామాజిక సంస్కర్త ఎండీ అమీర్ పాషా, బీబీ కృష్ణ చైతన్య తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు

ప్రకాశం నగర్ : సీతంపేట గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం గ్రంథాలయంలో చదవడం మాకు ఇష్టం కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కస్నూరి సతీష్‌బాబు విద్యార్థులకు మ్యాథ్స్‌కి సంబంధించిన సూత్రాలను తెలియజేశారు. వీటితో పాటు వివిధ పద్యాలు, ప్రభుత్వ పథకాలు గురించి చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సుగుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

సీటీఆర్ఐ: కష్టకాలంలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టీడీపీ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి రైతులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలని పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ మాధవీలతకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పాలిట విద్రోహి జగన్‌మోహన్ రెడ్డి అని రాష్ట్రంలో అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని, కష్టపడి పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నాయకులు పాల్గొన్నారు.

నేడు డైట్‌లో డీఆర్పీల సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో శుక్రవారం ఉదయం10 గంటలకు డీఆర్పీల సమావేశం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌డీవీ రమణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి డీఎస్సీ 1998(ఎంటీఎస్), డీఎస్సీ2008(ఎంటీఎస్), డీఎస్సీ 2018 ఎస్‌జీటీలకు వివిధ స్పెల్స్‌లో ఇండక్షన్ ట్రైనింగ్ ఇస్తామన్నారు. ట్రైనింగ్ ప్లానింగ్ నిమిత్తం ఏర్పాటు చేసిన సమావేశానికి డీఆర్పీలందరూ హాజరుకావాలని తెలిపారు.

అక్రమ కేసులకు భయపడేదిలేదు

సీటీఆర్ఐ: వైస్సార్‌సీపీ ప్రభుత్వం అక్రమంగా బనాయించిన కేసులకు బయపడేది లేదని టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం స్థానిక టీడీపీ నాయకులు ఆదిరెడ్డి అప్పారావు, ఆదిరెడ్డి వాసులకు బెయిల్ మంజూరైన సందర్భంగా సెంట్రల్ జైల్ నుంచి ఊరేగింపుతో వారి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. దీనికి నిదర్శనమే టీడీపీ నాయకులు అక్రమ అరెస్టులున్నారు.